కార్డులన్నీ అరిగిపోయి అరిగిపోయి ఎవ్వరి కోసం ఎవరుంటారు పాండిరా పాండి అన్నే పాట అయిదో వాయిదాలో వచ్చేసరికి ఆహ్వానితులొస్తారు అశ్వనీ దేవతల్లా, లిప్‌స్టిక్కుల్లా, మామూలు స్టిక్కుల్లా, గులాబీ పౌడర్లు పుచ్చుకుని టీచర్లంతా హడావిడి పడతారు. భీముడు గద విరగ్గొట్టి దెబ్బలు తింటాడు. వడ్డాణం అవతల పెట్టి స్కిప్పింగ్ ఆడుతున్న భారత మాత కిరీటం కోసం పరిగెడుతుంది. పౌడరు డబ్బా మీద కాలేసి పడిపోయిన అల్లూరు సీతారామరాజు ఇంటికెడతానని పేచీ పెడతాడు. నారదుడు పాలపీసా వదలనంటాడు.

కొట్టేవాళ్లని కొట్టి, తిట్టే వాళ్లని తిట్టి, ముద్దు పెట్టే వాళ్లకి పెట్టి రసాభాస వంతా ఓ కొలిక్కి తెస్తే మాత్రం స్టేజీ మీద చోటేదీ? ఉపన్యాసాల వర్షం పూర్తవాలా వద్దా? ఉప్పు సత్యాగ్రహం మొదలెట్టిన వ్యక్తి ప్రస్తుతానికి వచ్చేసరికి ఎంత సేపన్నా పట్టొచ్చు. నేటి బాలలు నేడే భావి భారత పౌరులయి పోవచ్చు.

తొందరగా కానివ్వండయ్యా వాయించి పోతాం. ఆఖరిబస్సు వేళదాటి పోతుంది అంటూ ఆర్కెస్ట్రా గోలెడుతూ వుంటారు.

ఉపన్యాసాలు చూసి పారిపోవాలా, పిల్లల కోసం ఆగిపోవాలా గొప్ప సమస్యవుతుంది పెద్దలకి. చివరాఖరికి తలెత్తగానే సగం నిద్రలో తేలి తలగోక్కుంటున్న ఎంకి నాయుడుబావ, ప్రోగ్రాం మార్పుతో రావణుడి మీసాలు చెరుపుకోడం మర్చిపోయిన రాధిక, గొంతెండిపోయిన జనగణమన బృందం కలిసి ప్రదర్శన పూర్తి చేస్తారు. అంత టైమూ అవలీలగా తినేసిన మహావక్తలెవరూ అక్కడెలాగో వుండరు కనక ప్రిన్సిపాలూ మిగతా స్టాఫూ కూడా మిగిలిపోయిన ప్రైజులూ పూలదండలూ రూములోకి చేరేస్తూనో, జనరేటరువాడితో పేచీపడుతోనో ఇంకేదో పనిలోనో మునిగిపోతారు.

మాట్లాడి మెప్పించగలవాళ్లని వేళ్ల మీద లెక్కపెట్టొచ్చు. మైకు పుచ్చుకున్న వాడెంత మేధావి అయినా వినేవాడి నాడి చూడ్డం అవసరం. అదిలేని చోట నిశ్శబ్దం నయం.

విరామ సంగీతం నయం. వెనక వరసల్లోంచి అరుపులు, పిల్లి కూతలు, తల్నొప్పులు, నిర్వాహకులు చెంపలేసుకోడాలు, ఈ అన్నిటికీకీ చాలావరకు వ్యక్తిబాధ్యతే వుంటుంది. ఒక్కోసారి ప్రేక్షకుల అపహాసం పెచ్చుమీరిపోతూ వుండొచ్చు.

బాబ్బాబు మీకేసిన దండ మీకివ్వండి అంతా తలో రెండుపూల్లూ చెవిలోపెట్టుకుని వింటాం అనొచ్చు. తస్మాత్ జాగ్రత్త జాగ్రత్త!

# జిందగీ.... జిందగీ



కన్య ఇప్పటికి వందసార్లు చదివింది ఆ ఉత్తరాన్ని. కొంత ప్రేమ, మరికొంత ఆప్యాయత, ఇంకా కొంచెం రసికత్వం మేళవించి రాశాడు మన్మథ్.

సాయంత్రం పార్కులో కలుసుకో, ఆ మాట లక్షసార్లు చదివింది. టైమ్ ఎప్పటికీ గడవనట్టు అది ఆగిపోయినట్టు విసుగ్గా మహా బోర్‌గావుంది.

ఇంట్లోంచి బయటికీ, బయటి నుంచి ఇంట్లోకీ తొంభైసార్లు తిరిగేసరికి కాళ్లు పీక్కుపోతున్నాయి. వంట ఇంట్లో తల్లి స్టౌ దగ్గర నానాపాట్లూ పడుతుంది. దూరం నుంచి తండ్రి రావడం కనిపించగానే ఓ క్షణం విసుగేసింది.

మాసిన పాంటూ, చిరిగిన షర్టు కనిపించకుండా కోటూ ఎండకీ, వానకీ ఎల్లవేళలా అంటి పెట్టుకున్న పాత కాలపు గొడుగూ నెత్తిన పరుచుకుంది. అరిగిపోయిన చెప్పులు అతని కాలినుంచి తప్పించుకోకుండా జాగ్రత్తగా నడుస్తున్నాడు, సగటు మధ్య తరగతి మందహాసం మొహం మీద పులుపుకున్న కుటుంబరావు. ఆయన భుజాలు సంసార భారానికి కృంగాయి.

పెరటి ద్వారంలోంచి చల్లగా జారుకుంది కన్య. అరగంటలో పార్కు చేరుకుంది. దూరంగా మన్మథ్ నవ్వుతూ చేతులు చాపాడు. కన్య వచ్చి అతని పక్కనే కూర్చుని చెప్పింది. 'మన్మథ్ నాకు చాలా రోజుల్నుంచి ఓ తీరని కోరిక వుండిపోయింది.'

'ఏమిటబ్బా అది' నల్ల కళ్లజోడు పక్కకి తీసి క్రీగంట చూశాడు.

'ఈ పార్కులో హాయిగా పరిగెడుతూ, గొప్పగా గొంతెత్తి పాడాలనీ, నీ నీడలో సినిమాల్లో చూపించినట్లు వొదిగిపోవాలనీ వుంది.'

'ఓస్' అతను నవ్వాడు! అదేం పెద్దకోరిక!

''అయితే నీకు పాటలువచ్చా''

'దర్జాగా', ఇంతకీ నీకు వచ్చునా?'

'లతామంగేష్కర్‌లా, సుశీలలా పాడగలను.'

'అయితే ఇంకేం.. చలో.... నాతో స్టెప్స్‌వేయి'

భయం భయంగా చూసింది కన్య.

' మన పార్కు మనిష్టం. మనం అమర ప్రేమికులం. నేను చిటికె వేశానంటే మా నాన్న కొండ మీది కోతిని తీసుకురాగలరు. అటువంటిది నీ చిన్న కోర్కె తీర్చలేనా. కమాన్. అప్..' అతనామె చేతిని సుతారంగా అందుకున్నాడు.

'ఏం పాడను?'

'నీ ఇష్టం'

'బృందావన్ గార్డెన్స్ అయివుంటే రాధా రావే, అనే వాడిని'

కన్య నెమ్మదిగా పాట అందుకుంది. 'ఏ మోసమ్ రంగీన్‌సమా..?

'తెలుగు పాడరాదూ'

కన్య రెండు చేతులూ విశాలంగ చాపి 'ఆకాశం వైపు చూస్తూ 'ఓ... మరుమల్లెలలో మావయ్యా' అంటూ పరుగెత్తింది.

మన్మథ్ ఆ పాటని పూర్తి చేశాడు.

పోలీస్ స్టేషన్నుంచి కన్య తండ్రీ, మన్మథ్ తండ్రీ ఇద్దర్నీ తీసుకెళ్లారు. కన్యకి పోలీసులెందుకు పట్టుకువెళ్లారో అర్థం కాలేదు. సినిమాల్లో వాళ్లనెందుకు తీసుకువెళ్ళరు?

ఆరునెల్ల తరువాత కన్య భర్త కోసం కిరోసిన్‌స్టౌ మీద టీ నీళ్లు పడేసింది. కారూ, మేడా, మన్మథ్ కలగా మిగిలిపోయింది.

మన్మథ్ తరువాత చాలా మందికి ఉత్తరాల్లో మాత్రం ప్రేమ పంచిపెట్టాడు. చివరికి అమెరికా పంపించే మామకి అల్లుడయ్యాడు.

అతను ఏరోప్లేన్‌లో భార్యతో గుసగుసలాడాడు,'యూ ఆర్ మై స్వీట్ హార్ట్!' ఎవరూ చూడకుండా మృదువుగా ముద్దెట్టుకున్నాడు.

గంటి వెంకటరమణ